క్లుప్తంగా

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని ఎంఈఓ హేమలత ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం మండలంలోని ముట్టుకూరు ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఈఓ హేమలత పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్లను, పాఠశాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని సూచించారు. విద్యార్థులు చదవడం, రాయడంపై పట్టు సాధించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఆదేశించారు. తరగతిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సూచనలు, సలహాలిచ్చారు. ఉపాధ్యాయులు విద్యార్థుల చదువు పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంఈఓతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 32 మంది ఎంపిక


రోగులకు పరీక్ష నిర్వహిస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 32 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికై నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విచ్చేసిన 55 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు చేశారు. అందులో 32 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఎట్టకేలకు రేషన్ పంపిణీ

యాదమరి: నిత్యావసరాల కోసం వారంరోజుల పాటు కాళ్లరిగేలా తిరిగిన పేదలకు విముక్తి కలిగింది. మహిళల ఫిర్యాదుతో స్పందించిన స్థానిక తహసీల్దార్ పార్థసారథి సోమవారం రెవెన్యూ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు రేషన్ పంపిణీ ప్రారంభించారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని పాచిగుంటలో గత నెలలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభోత్సవంలో డీలర్ పెరుమాళ్ అనారోగ్య కారణాలతో గైర్హాజరయ్యారు. దీనిపై ఆగ్రహించిన తహసీల్దార్ దీనిపై ఆర్డీఓకు ఫిర్యాదు చేయడంతో ఆయన సదరు డీలర్‌పై సస్పెన్షన్ విధించారు. దీంతో ఈ నెల కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ నిలిచిపోయింది. దీనిపై పాచిగుంట, పత్రపల్లి, కనికాపురం, దేవలం తదితర గ్రామాలకు చెందిన మహిళలు డీటీని కలిసి గత గురువారం వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ సోమవారం రెవెన్యూ సిబ్బంది లబ్ధిదారులకు నిత్యావసరాలు పంపిణీ ప్రారంభించారు.

క్రిమి సంహారక మందుల సరఫరాకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పట్టు క్రిమిసంహారక మందులు సరఫరా చేసేందుకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పట్టు పరిశ్రమ ఆధ్వర్యంలో రైతులకు క్రిమిసంహారక మందులు సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. సున్నం, బ్లీచింగ్, అస్త్ర, వెటకేర్, సప్లిమెంట్, పోర్ట్, గ్రీన్, సానిటిక్, ఊజిసైడ్, సురక్ష, అంకుష్ క్రిమిసంహారక మందులను సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 11వ తేదీ నుంచి 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఇరువారంలో ఉండే పట్టు పరిశ్రమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాక్సుల్లో వేయాలన్నారు. వివరాలకు 9866699198 నంబరులో సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

రెండు వాహనాలు ఢీ

పూతలపట్టు (యాదమరి): ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డ ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. సోమవారం సాయంత్రం చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారి, తిమ్మిరెడ్డిపల్లి వద్ద గల ఓ ప్రైవేటు ఫ్యాక్టరీ సమీపంలో చిత్తూరు నుంచి తమిళనాడుకు చెందిన ఓ కంటైనర్ వెళ్తోంది. అదే సమయంలో కర్ణాటక నుంచి ఐచర్ పీలేరు నుంచి చిత్తూరు వైపుగా వెళ్తుండగా ఓ బైక్‌ను తప్పించబోయి ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఒకరి పరిస్థితి విషమం కాగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

నిత్యాన్నదానానికి విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంకు సోమవారం హైదరాబాద్‌కు చెందిన రామకృష్ణ అన్నదానానికి రూ.లక్ష నగదు అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ అధికారులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

విన్నవించాం.. దయ చూపండి

- పీజీఆర్ఎస్‌లో వచ్చే వినతుల పరిష్కారంలో అలసత్వం వద్దు
- దివ్యాంగ పింఛన్ కోసం బారులు తీరిన దివ్యాంగులు
- వినతులు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ
- వివిధ సమస్యలపై సుమారు 343 అర్జీల నమోదు


పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు సమస్యలు విన్నవించుకుంటున్న అర్జీదారులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వినతులు వెల్లువెత్తాయి. వివిధ సమస్యల పరిష్కారం కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో వినతులు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై 343 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ ఏఓ వాసుదేవన్ వెల్లడించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


పీజీఆర్ఎస్‌లో వినతులు ఇచ్చేందుకు విచ్చేసిన వివిధ ప్రాంతాల ప్రజలు

వితంతు పింఛన్ మంజూరు చేయండి


వితంతు పింఛన్ ఇప్పించాలని కోరుతున్న తస్లీమ్

తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని రొంపిచెర్ల మండలానికి చెందిన తస్లీమ్ జిల్లా కలెక్టరేట్‌లోని అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఈ మేరకు ఆమె విలేకరులతో మాట్లాడారు. తన భర్త క్యాన్సర్ వ్యాధితో మృతి చెందారన్నారు. తనకు 4 సంవత్సరాల కుమార్తె ఉన్నట్లు తెలిపారు. తన భర్త మృతి చెందడంతో తన తల్లి ఇంట్లో ఉంటున్నామని చెప్పారు. వితంతు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని ఆమె కోరారు.

రూ.15 వేలు పింఛన్ ఇప్పించండి


పింఛన్ ఇప్పించాలని కోరుతున్న మునిరత్నం రెడ్డి

నాకు నూరు శాతం అంగవైకల్యం ఉంది.. రూ.15 వేలు దివ్యాంగ పింఛన్ ఇప్పించండి సారు. మాది పెద్దపంజాణి మండలం ఆకులవారిపల్లి. అంగవైకల్యం వల్ల ఇబ్బంది పడుతున్నారు. నాకు రూ.15 వేల పింఛన్ ఇచ్చి ఆదుకోండి సామీ. నాకు 100 శాతం వికలత్వం ఉన్నప్పటికీ రూ.15 వేలు పింఛన్ ఇవ్వడం లేదు. అధికారులు పరిశీలించి నాకు పింఛన్ ఇప్పించాలి.

శ్మశాన వాటిక ఏర్పాటు చేయండి


శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని కోరుతున్న మాపాక్షి హరిజనవాడ గ్రామస్తులు

తమ గ్రామంలో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని చిత్తూరు రూరల్ మండలం మాపాక్షి హరిజనవాడకు చెందిన ప్రభావతి, అశోక్, తదితరులు వాపోయారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ఉన్న శ్మశాన వాటిక రోడ్డు విస్తరణలో పోయిందన్నారు. గతంలో ఉన్న శ్మశానవాటికకు పడమర 1.5 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దాన్ని పరిశీలించి శ్మశానవాటికను ఏర్పాటు చేయాలని కోరారు.

దివ్యాంగ పింఛన్ ఇప్పించండి


పింఛన్‌కు కలెక్టరేట్‌కు విచ్చేసిన జ్ఞానేశ్వర రెడ్డి

తన కుమారుడు జ్ఞానేశ్వర రెడ్డికి దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని జీడీ నెల్లూరు మండలం పోలినాయుడుపల్లికి చెందిన విజయ లక్ష్మి కోరారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ తన కుమారుడికి చిన్నతనం నుంచే అంగవైకల్యం ఉందన్నారు. నడవలేని స్థితిలో మంచానికే పరిమితమై ఉంటాడని తెలిపారు. రూ.15 వేల పింఛన్‌కు పలుమార్లు దరఖాస్తు చేస్తున్నప్పటికీ మంజూరు చేయడం లేదన్నారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

ఎంపీ మిథున్‌రెడ్డితో భేటీ


ఎంపీ మిథున్‌రెడ్డితో మాట్లాడుతున్న జ్ఞానజగదీష్

చిత్తూరు కార్పొరేషన్: రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ కలిశారు. మర్యాద పూర్వకంగా మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మద్యం కేసులో అరెస్టు అయిన ఎంపీ మిథున్‌రెడ్డికి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేయడానికి ఇటీవల మధ్యంతర బెయిల్ వచ్చిన విషయం తెలిసిందే.

నేడు అన్నదాత పోరు

ఐరాల/బంగారుపాళెం: పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలో మంగళవారం చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని సోమవా రం ఐరాల, బంగారుపాళెం మండలల కన్వీనర్లు చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, నియోజకవర్గ, మండల అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

కాణిపాకం అభివృద్ధికి ప్రతిపాదనలు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో టీటీడీ కల్యాణ మండపం, విశ్రాంతి భవనం నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడుకు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈఓ పెంచల కిషోర్ అందజేశారు. వారు సోమవారం ఆయనను కలిసి అభివృద్ధిని వివరించారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

నేడు పొలం పిలుస్తోంది

గుడిపాల: మండలంలోని చిత్తపార, బండపల్లె గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఓ సంగీత తెలిపారు. చిత్తపార గ్రామంలో రైతులతో సమావేశం ఉంటుందని, ఇందులో పంటలకు సంబంధించి సమస్యలపై తెలియజేస్తామన్నారు. త్వరలోనే మండలంలోని గుడిపాల, బొమ్మసముద్రం, పేయనపల్లె రైతుసేవా కేంద్రాల ద్వారా యూరియా అందజేస్తామని ఆమె తెలిపారు.

నేడు సర్పంచ్, ఎంపీటీసీలకు శిక్షణ

తవణంపల్లె: మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు మంగళవారం ఉదయం 10 గంటలకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డిబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు పాత్రపై అవగాహన కల్పిస్తారన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పక హాజరుకావాలని వివరించారు.

రెండు రోజుల్లో ఆరు బైకులు చోరీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గత రెండు రోజుల్లో ఆరు బైకులు చోరీకి గురయ్యాయి. నగరంలోని మార్కెట్‌చౌక్, చర్చి వీధి, వేలూరు రోడ్డు, పలమనేరు రోడ్డు, కట్టమంచి ప్రాంతాల్లో ఆరు ద్విచక్రవాహనాలు చోరీకి గురవడంతో.. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొన్ని ఇళ్ల వద్ద పార్కింగ్ చేసి ఉంటే.. మరికొన్ని దుకాణాలకు వెళ్లేటప్పుడు పార్కింగ్ చేసిన వాటిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్లలో వీటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామిడిని నరికేస్తున్నారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మామిడి తోటలు మాయవుతున్నాయి. ఫలం లేదని ఇష్టానుసారంగా నరికేస్తున్నారు. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామ పరిసరాల్లో వేలాది ఎకరాల్లో సాగులో ఉన్న మామిడి చెట్లను నరికేస్తున్నారు. దీంతో విస్తీర్ణం గణనీయంగా తగ్గుముఖం పడుతోంది. నరికేసిన చెట్లను ముక్కలు..ముక్కలుగా చేసి లారీల్లో తరలిచ్చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కూటమికి చెందిన వారిది అయితే ముట్టుకోవడానికి సాహసం చేయడం లేదని విమర్శిస్తున్నారు. అదే సామాన్య రైతులదే భయపెట్టి జరిమానాలు కట్టిస్తున్నారని మండిపడుతున్నారు. అటవీశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యూరియా పంపిణీ


మహాసముద్రంలో యూరియా కోసం వేచి ఉన్న రైతులు

బంగారుపాళెం: మండలంలోని మహాసముద్రం రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. తహసీల్దార్ బాబురాజేంద్ర ప్రసాద్ ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ భారతి మాట్లాడుతూ మహాసముద్రం ఆర్ఎస్‌కే పరిధిలో 150 మంది రైతులకు యూరియా పంపిణీ చేశామన్నారు. మండలానికి 300 మెట్రిక్ టన్నుల యూరియా ఇండెంట్ పెట్టగా 107 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, మిగిలింది రావాల్సి ఉందని తెలిపారు. తవణంపల్లె మండలంలో కూడా యూరియా పంపిణీ చేసినట్లు ఆ మండల ఏఓ ప్రవీణ్ తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు 12 వినతులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 12 వినతులు వచ్చినట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. అందులో భాగంగా ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులపై ఆయన అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇంజినీరింగ్– 6, పింఛను –2, ప్రణాళిక విభాగం–2, ప్రజారోగ్య విభాగం –1, టిడ్కో –1 చొప్పున మొత్తం 12 వినతులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎంహెచ్ఓ డా.లోకేష్, ఏసీపీ నాగేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై రణభేరి జాతా


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : పాఠశాల విద్యారంగ సమస్యల పరిష్కారానికి రణభేరి జాతా నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో రణభేరి జాతా పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థిక పరమైన సమస్యల పరిష్కారానికి ఈ నెల 15వ తేదీ నుంచి 19 వరకు రణభేరి జాతా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారానికి నోచుకోలేదని విమర్శించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్ మాట్లాడుతూ టీచర్లపై బోధనేతర పనులు అధికంగా మోపుతుండడంతో విద్యార్థుల బోధనకు దూరం కావాల్సిన దుస్థితి ఎదురవుతోందన్నారు. పీఆర్‌సీ కమిషన్ వెంటనే నియమించాలన్నారు. పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సీఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో ఈ నెల 15వ తేదీ నుంచి రణభేరి జాతా ప్రారంభిస్తున్నామన్నారు. ఈ జాతాలో టీచర్లు పెద్దసంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లను వెల్లడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రెహానా బేగం, ఎస్‌పీ బాషా, ఏకాంబరం, పార్థసారథి, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

సహేతుకం కాదు సార్..


తాళం తొలగించిన అనంతరం లోనికి వెళ్తున్న దివ్యాంగులు

జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి వేలాది మంది ప్రజలు తమ పనుల నిమిత్తం అధికారులను కలిసేందుకు వస్తారు. అయితే కార్యాలయ ప్రధాన గేటు వద్ద ఇనుపరాడ్లను దాటుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రధాన గేటు వద్ద ఇనుప రాడ్లల్లో దాటుకునేటప్పుడు చాలామంది దివ్యాంగులు ఇబ్బంది పడుతుంటారు. అయితే గతంలో ఇక్కడ పని చేసిన ఒక కలెక్టర్.. ప్రధాన గేటుకు పక్కనే దివ్యాంగుల కోసం చిన్న గేటు నిర్మించారు. అయితే సోమవారం కలెక్టరేట్ వద్ద దివ్యాంగులు ధర్నా చేసేందుకు రాగా అధికారులు చిన్న గేటును మూసివేశారు. దీంతో వారు అధికారుల తీరును ఖండిస్తూ ఉద్దేశ పూర్వకంగా మూసివేసి లోపలకు రాకుండా కుట్రలు చేస్తున్నారంటూ ప్రధాన గేటు వద్దే ధర్నాకు దిగారు. పోలీసులు వారిని అడ్డుకునేందుకు యత్నించారు. ఎంతకీ కలెక్టరేట్ అధికారులు స్పందించకపోవడంతో చివరకు చిన్న గేటు తాళాన్ని పగులగొట్టి లోపలకు వెళ్లారు. అనంతరం కలెక్టర్‌కు తమ డిమాండ్లను చెప్పి పరిష్కరించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో దివ్యాంగ సంఘ నాయకులు చంద్రశేఖర్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

– చిత్తూరు కలెక్టరేట్.


కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద బైఠాయించి ధర్నా నిర్వహిస్తున్న దివ్యాంగులు.


ధర్నా విరమించాలని దివ్యాంగులను హెచ్చరిస్తున్న పోలీసులు.

అడ్డగోలు వసూళ్లపై సమగ్ర విచారణ

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు కలెక్టరేట్ : స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టీసీ (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్) మంజూరుకు అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్న నాన్ టీచింగ్ సిబ్బందిపై ఇంటర్మీడియట్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ఆ కళాశాలలో జరుగుతున్న అక్రమాలపై సాక్షి దినపత్రికలో ఈ నెల 8వ తేదీన ''రూ.వెయ్యి ఇస్తేనే టీసీ'' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఇంటర్మీడియట్ డీఐఈఓ రఘుపతి సమగ్ర విచారణకు ఆదేశించారు. ఆ కళాశాలలో ప్రస్తుతం పనిచేస్తున్న రికార్డ్ అసిస్టెంట్ ఇటీవలే విధుల్లో చేరడంతో విచారణ చేపట్టి అతనిది ఎలాంటి తప్పులేదని ధ్రువీకరించారు. గతంలో పీసీఆర్‌లో పనిచేస్తూ (ప్రస్తుతం డిప్యూటేషన్‌పై రూరల్ మండలంలో) పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది జారీచేసిన టీసీలను సమగ్రంగా విచారిస్తున్నారు. ఆ నాన్‌టీచింగ్ సిబ్బంది జారీ చేసిన టీసీలు ఎన్ని ? ఎవరెవరికి జారీ చేశారనే కోణంలో విచారణ చేస్తున్నారు. సంబంధిత విద్యార్థుల తల్లిదండ్రులకు కాల్ చేసి విచారించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

బంగారుపాళెం: ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కీరమంద హైస్కూల్‌లో అ అక్షర ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

మనిషిని మహోన్నతుడిని చేసేది విద్య

మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య మాత్రమేనని కీరమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణవేణి అన్నారు. సోమవారం పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 ఏళ్లలోపు బాలబాలికలకు ప్రభుత్వాలు ఉచిత నిర్బంధ విద్యను అందిస్తున్నాయని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు 'అ' అక్షరం ఆకారంలో కూర్చుని అక్షరాస్యత ప్రాధాన్యతను తెలియజేసేలా ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాళివాహనంపై వరసిద్ధుడి వైభోగం


భక్తులను కటాక్షిస్తున్న విఘ్నేశ్వరుడు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ప్రత్యేక బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. సిద్ధి బుద్ధి వినాయకస్వామి సోమవారం యాళివాహనంపై భక్తులకు అభయమిచ్చారు. వేకువజామున స్వామిని సుప్రభాతసేవలో మేల్కొలిపి పూజలు చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి ఉత్సవమూర్తి విగ్రహాన్ని పలు రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. భుజంపై మోసుకెళ్లి యాళి వాహనంపై కొలువుదీర్చారు. తర్వాత మంగళ వాయిద్యం, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు సూర్యప్రభ..

ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి సూర్యప్రభ వాహన సేవ జరగనున్నట్టు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు.



నాట్యమయూరాలు



కాణిపాకం: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక దేవస్థాన ఆస్థాన మండపంలో సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి. వేదికపై కళాకారులు కూచిపూడి, భరతనాట్యంతో అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. భక్తిభావం పెంపొందేలా చేసిన పలువురి నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయ అధికారులు వారిని అభినందించారు.